ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.7 కనిష్ఠం 17.2



కామారెడ్డి జిల్లా వార్తలు
5
బుధవారం 10 జనవరి 2024

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్, జనవరి 9: తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో కొత్త అడ్మిషన్లు, 7వ తరగతి నుంచి 10వ తరగతుల్లో మిగిలిన ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణఎంఎస్.సీజీజీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 12 నుంచి వచ్చేనెల 22 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని బాన్సువాడ, మద్నూర్, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, సదాశివనగర్, ఎల్లారెడ్డిలలో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయన్నారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 7న జరుగుతుందని వివరించారు.



మంజీరా నదిలో తవ్వకాలు జరపడంతో ఏర్పడిన గుంతలు



ఇసుక తవ్వకాలపై నజర్

- కదిలిన ఉమ్మడి జిల్లా యంత్రాంగం
- ఐదు శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన సర్వే
- ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు సిద్ధమవుతున్న అధికారులు

నిజామాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మంజీరా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఉమ్మడి నిజామాబాద్ జిల్లా యంత్రాంగం కదులుతోంది. ప్రభుత్వానికి పెద్ద ఎత్తున అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదులు అందడంతో అధికారులు తవ్వకాలపైన నజర్ పెట్టారు. మంజీరా నది వెంట సర్వేలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాపరిధిలో ఈ పదేళ్లలో అక్రమంగా తవ్విన ఇసుకపై పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఐదు శాఖల ఆధ్వర్యంలో అన్ని రకాల సర్వేలు నిర్వహించిన తర్వాత ఎంత మొత్తంలో తవ్వకాలు చేశారో పొందుపర్చి ప్రభుత్వానికి పంపించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. మంజీరా నుంచి ఎంత మొత్తంలో తవ్వకాలకు అనుమతి ఇచ్చారో వివరాలను తీసుకోవడంతో పాటు ఎంత మొత్తంలో ఎక్కువగా తవ్వకాలు చేశారో లెక్కలను తీస్తున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సర్వేను నిర్వహిస్తూ వరదల ద్వారా ప్రతీ సంవత్సరం వచ్చే ఇసుక లెక్కలను కూడా తీస్తూ పూర్తి నివేదికను తయారు చేస్తున్నారు. ఈ పదేళ్లలో ఎవరెవరికి అనుమతి ఇచ్చారు, ఎంత మొత్తంలో అక్రమంగా తవ్వకాలు చేశారో ఆ వివరాలను పొందుపర్చి ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధమవుతున్నారు.



అనుమతుల కంటే ఎక్కువే తవ్వకాలు

మంజీరా నది నిజాంసాగర్ నుంచి రెంజల్ మండలం వరకు ఉమ్మడి జిల్లా పరిధిలో విస్తరించి ఉంది. ఉమ్మడి రాష్ట్ర హయాం నుంచి మంజీరా వెంట ఇసుక తవ్వకాలకు అనుమతి ఇస్తున్నారు. క్వారీలను కేటాయిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత రెండు సంవత్సరాల వరకు ఇసుక క్వారీలకు అనుమతులను ఇచ్చారు. ఆ తర్వాత టీఎస్ఎండీసీకి క్వారీలను కేటాయించారు. ఈ సంస్థ ద్వారా తవ్వకాలను చేశారు. టీఎస్ఎండీసీకి తవ్వకాల కోసం ఇతర వ్యక్తులకు ఈ క్వారీలను కేటాయించారు. ఈ పదేళ్లలో బిచ్కుంద, బీర్కూర్, పొతంగల్, బోధన్, రెంజల్ మండలాల పరిధిలో మంజీరా వెంట ఇసుక తవ్వకాలు కొనసాగాయి. అధికారికంగా బిచ్కుంద, బీర్కూర్, పొతంగల్, బోధన్ మండలాల పరిధిలో టీఎస్ ఎండీసీకి గత ప్రభుత్వ హయాంలో కేటాయింపులను చేశారు. ఐదేళ్ల క్రితం వాటిలో పొతంగల్, బోధన్ మండలాల పరిధిలో విరమించుకున్నారు. బిచ్కుంద, బీర్కూర్ మండలాల పరిధిలో ఎత్తిపోతల పథకాల నిర్మాణం పేరుతో క్వారీలకు అనుమతి ఇచ్చారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణం కింద ఇసుక తవ్వకాలను చేశారు. ఇవే కాకుండా టీఎస్ఎండీసీకి మరి కొన్ని క్వారీలను మంజీరా వెంట ఈ రెండు మండలాల పరిధిలో కేటాయించారు. టీఎస్ఎండీసీకి అనుమతులు ఇచ్చిన పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలను చేశారు. కేటాయించిన క్యూబిక్ మీటర్లకన్నా ఎక్కువ మొత్తంలో ఈ ఇసుక తవ్వకాలను చేశారు.

ఇతర జిల్లాలకు తరలింపు

అక్రమంగా తవ్విన ఇసుకను హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాలకు తరలించారు. భారీ ఎత్తున తవ్వకాలను చేశారు. మంజీరా వెంట కొన్ని చోట్ల ప్రభుత్వ అవసరాల పేరుమీద పెద్ద ఎత్తున ఈ తవ్వకాలకు పాల్పడ్డారు. ఈ పదేళ్లలో అనుమతులు ఇచ్చిన దానికంటే ఎక్కువ మొత్తంలో క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వకాలు చేశారు. మంజీరాలో చేపట్టిన ఎత్తిపోతల పథకాల పేరుతో కొంత మొత్తంలో ఇసుక తవ్వకాలు చేయగా ప్రభుత్వ అవస రాల పేరుతో మంజీరాలో ఇసుకను తవ్వారు. ఈ రెండు పేర్లు చెప్పి స్థానిక నేతల సహకారంతో పెద్ద ఎత్తున అక్రమ ఇసుక రవాణా చేపట్టారు. భారీగా ఇసుకను కొల్లగొట్టారు.

గతంలో మంజీరా వెంట ఉన్న గ్రామాల వారు ప్రభుత్వానికి తవ్వకాలు చేయవద్దని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. అధికారుల చుట్టూ తిరిగి వినతులు ఇచ్చిన కొద్ది రోజులు తగ్గించి మళ్లీ యదావిధిగా ఈ తవ్వకాలను చేశారు. ఇదే రీతిలో మహారాష్ట్ర వైపు కూడా ఇక్కడివారే అనుమతులు తీసుకొని మం జీరాకు అవతలి వైపు తవ్వకాలను కొనసాగించారు. రెండు వైపులా పెద్ద ఎత్తున ఈ ఇసుక తవ్వకాలను చేశారు. గతంలో కొన్ని సార్లు అక్రమంగా ఇసుక తవ్వకాలను అరిక ట్టడంతో పాటు జేసీబీలు, వాహనాలను సీజ్ చేసిన కొద్ది రోజుల పాటు నిలిపివేసి మళ్లీ యదావిధిగా కొనసాగించారు. మంజీరా వెంట ఉన్న గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదులను పట్టించుకోలేదు. ఎవరైనా ధర్నాలు చేస్తే వారిపైనే బెదిరింపులకు పాల్పడ్డారు. నయానో బయానో చెప్పి ఒప్పించారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరించారు.

మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

రాష్ట్రంలో ప్రభుత్వం మారడం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో పలువురు ఈ అక్రమ ఇసుక తవ్వకాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. జిల్లాకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించారు. ఆయన వెంటనే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మంజీరా వెంట అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పూర్తిస్థాయి నివేదిక అందించాలని ఆదేశాలను ఇచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదేశాలతో ఉమ్మడి జిల్లా పరిధిలోని అధికారులు తరిలారు. గనులు, భూగర్భ శాఖ, ఇరిగేషన్, రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఈ సర్వేను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం టీఎస్ఎండీసీకి ఎన్ని లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను కేటాయింపులు చేసింది వివరాలను తీసుకుంటున్నారు. ఈ వివరాల ప్రకారం అంతే మొత్తంలో మంజీరా వెంట తవ్వకాలను చేశారా, అంతకుమించి ఎంత ఎక్కువగా అక్రమంగా ఇసుకను తవ్వారు, ఏ ప్రాంతంలో ఎక్కువగా తవ్వకాలను చేశారు, అనుమతులు లేకుండా మంజీరా వెంట ప్రభుత్వ పథకాలు మినహా ఎంత మొత్తంలో తవ్వకాలను చేశారో అనే అంశాలపైన ఆరా తీస్తున్నారు. జీపీఎస్‌తో పాటు ఇతర సర్వేకు సంబంధించిన అన్ని సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి ఈ తవ్వకాలపై వివరాలను తీసుకుంటున్నారు. ఈ పదేళ్లలో మంజీరా వెంట ఎంత మొత్తంలో ఇసుక తవ్వకాలు చేశారో వివరాలను సర్వే ద్వారా పరిశీలించడంతో పాటు ఈ పదేళ్లలో వర్షాల వల్ల వరద రాకతో ఎంత మొత్తంలో ఇసుక చేరిందో భూగర్భ జలాల ఆధారంగా వివరాలను తీసుకుంటున్నారు. ఐదు శాఖల అధికారుల ఆధ్వర్యంలో పూర్తి సర్వేను నిర్వహించి ప్రభుత్వానికి నివేదికను పంపించేందుకు సిద్ధమవుతు న్నారు. ఈ నివేదికను జిల్లా ఇన్‌చార్జి మంత్రికి కూడా అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. నిబంధనలకు మించి ఇసుక తవ్వకాలను చేస్తున్న వారిపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం మారడం ఇసుక తవ్వకాలపై అధికారులు సర్వే నిర్వహిస్తుండటంతో మంజీరా వెంట ఉన్న గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దని కోరుతున్నారు. ఇసుక తవ్వకాలు చేయడం వల్ల భూగర్భ జలాలు దెబ్బతింటున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి సర్వే నివేదిక తర్వాత ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో తేలే అవకాశం ఉంది.

ఉత్కంఠగా సాగుతున్న కబడ్డీ పోటీలు

- ఉదయం 12 మ్యాచ్‌లు.. సాయంత్రం 9 మ్యాచ్‌ల నిర్వహణ
- పోటీలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున తరలివస్తున్న ప్రజలు
- కూత కూతకు క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న వీక్షకులు



పోటీల్లో తలపడుతున్న తెలంగాణ, విద్యా భారతీ జట్లు

కామారెడ్డి టౌన్, జనవరి 9: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కొనసాగుతున్న 67వ జాతీయ ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు రోజురోజుకూ ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నాయి. మంగళవారం లీగ్ మ్యాచ్‌లు సాగగా ఉదయం 12 మ్యాచ్‌లు సాయంత్రం 9 మ్యాచ్‌లు జరిగాయి. ఈ పోటీలను వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ జట్టు ఎవరితో తలబడినా మైదానమంతా ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంటుంది. కూతకూతకు క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్నారు. మంగళవారం ఉదయం తెలంగాణ వర్సెస్ విద్యాభారతీ జట్లు పోటీపడగా తెలంగాణ జట్టు మొదట ఆధిక్యం చూపింది. ఆ తర్వాత కొద్దిమేర తడబడి విద్యాభారతీ జట్టుకు పాయింట్లు సమర్పించుకున్నా తిరిగి పుంజుకుని విద్యాభారతీ జట్టును ఓడించింది. విద్యాభారతీ 34 పాయింట్లు సాధించగా, తెలంగాణ 49 పాయింట్లు సాధించి విజయం కైవసం చేసుకుంది.

రెండు సెషన్స్‌లలో 21 మ్యాచ్‌లు

ఉత్సాహభరితంగా కొనసాగుతున్న కబడ్డీ పోటీల్లో మంగళవారం మొత్తం 21 మ్యాచ్‌లు ఆడారు. ఉదయం ఉత్తరప్రదేశ్ వర్సెస్ జార్ఖండ్ పోటీ పడగా ఉత్తరప్రదేశ్ విజయం సాధించింది. కర్ణాటక వర్సెస్ జమ్మూ కశ్మీర్ పోటీ పడగా కర్ణాటక జట్టు విజయం సాధించింది. ఉత్తరఖండ్ వర్సెస్ విద్యాభారతీ జట్లు పోటీ పడగా విద్యాభారతీ జట్టు విజయం సాధించింది. ఢిల్లీ వర్సెస్ పుదిచ్చేరి జట్లు పోటీ పడగా ఢిల్లీ జట్టు విజయం సాధించింది. తెలంగాణ వర్సెస్ విద్యాభారతీ జట్టు పోటీ పడగా తెలంగాణ జట్టు విజయం సాధించింది. తమిళనాడు వర్సెస్ ఢిల్లీ పోటీ పడగా ఢిల్లీ జట్టు విజయం సాధించింది. హిమాచల్ ప్రదేశ్ వర్సెస్ సీబీఎస్ జట్టు పోటీ పడగా హిమాచల్ ప్రదేశ్ విజయం సాధిం చింది. బీహార్ వర్సెస్ సీఎస్‌సీఈ పోటీ పడగా బీహార్ జట్టు విజయం సాధించింది. సాయంత్రం వేళలో నిర్వహించిన మ్యాచ్‌లలో ఢిల్లీ వర్సెస్ గుజరాత్ పోటీపడగా ఢిల్లీ విజయం సాధిం చింది. హిమాచల్ ప్రదేశ్ వర్సెస్ కేవీఎస్ పోటీ పడగా హిమాచల్ ప్రదేశ్ విజయం సాధించింది. మధ్యప్రదేశ్ వర్సెస్ విద్యాభారతీ పోటీ పడగా విద్యాభారతీ జట్టు విజయం సాధిం చింది. హర్యానా వర్సెస్ తమిళనాడు మధ్య పోటీ జరుగగా హర్యానా విజయం సాధించింది. పంజాబ్ వర్సెస్ మహారాష్ట్ర పోటీ పడగా మహారాష్ట్ర విజయం సాధించింది. తెలంగాణ వర్సెస్ చత్తీస్‌ఘడ్ పోటీ పడగా చత్తీస్‌ఘడ్ విజయం సాధించింది. కర్ణాటక వర్సెస్ ఒడిశా పోటీ పడగా కర్ణాటక విజయం సాధించింది. వీటితో పాటు పలు జట్లు సైతం హోరాహోరీగా తలపడి విజయాన్ని కైవసం చేసుకున్నాయి. మరో రెండు రోజుల పాటు ఈ పోటీలు జరగనుండగా నేడు సెమీ ఫైనల్, రేపు ఫైనల్స్ జరగనున్నాయి. నేటితో ఎన్ని జట్లు ఉంటాయి ఎన్ని జట్లు ఇంటిదారి పడతాయనేది తేలనుంది.

ప్రజా పాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ వేగవంతం

- దరఖాస్తుల కంప్యూటరీకరణ
- 663 కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం
- జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు 3,08,166
- ఇప్పటి వరకు నమోదు చేసింది లక్షా 50వేల దరఖాస్తులు
- ఆన్‌లైన్‌కు ప్రత్యేక పోర్టల్
- పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు
- ఇది వరకే ఆపరేటర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు

కామారెడ్డి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో ఆరు గ్యారెంటీల అమలు కోసం స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ వేగవంతంగా కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో డాటా ఎంట్రీ ముమ్మరంగా సాగుతోంది. డాటా ఎంట్రీ ఆపరేటర్లు దరఖాస్తులోని వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయడంలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17వ తేదీలోగా అన్ని దరఖాస్తుల వివరాలను ఎంట్రీ చేయడానికి శ్రమిస్తున్నారు. డిసెంబరు 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలై ఈనెల 6వ తేదీతో ముగిసింది. ఆ రోజు నుంచే డాటా ఎంట్రీని మొదలుపెట్టారు. పథకాల లబ్ధి కోసం జిల్లా వ్యాప్తంగా 3,08,166 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకు సుమారు లక్షా 50 వేల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో కంప్యూటరీకరించినట్లు అధికారులు చెబుతున్నారు.

663 మంది కంప్యూటర్ ఆపరేటర్ల సహాయంతో..

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో ప్రజాపాలన దరఖాస్తులు 3,08,166 వచ్చాయి. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు 663 మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. కామారెడ్డి పరిధిలో 224 మంది, ఎల్లారెడ్డిలో పరిధిలో 148 మంది, బాన్సువాడ పరిధిలో 80 మంది, జుక్కల్‌లో 111 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్ల సహాయంతో కంప్యూటరీకరిస్తున్నారు. మండల పరిషత్, తహసీల్దార్, ఐకేపీ, జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయం తదితర అవకాశాలు ఉన్నచోట్ల దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ రాజంపేట మండలంలో జరుగుతున్న కంప్యూటరీకరణను పరిశీలించారు.

సిబ్బందికి శిక్షణ..

ప్రజా పాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై ఎంపీడీవో, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్‌లు, టీం లీడర్లు డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలంటే దరఖాస్తుల స్వీకరణతో పాటు డాటా ఎంట్రీ కూడా చాలా ముఖ్యమైంది. దరఖాస్తుల్లోని వివరాలను ఆన్‌లైన్ చేసిన తర్వాత ఆ వివరాలతోనే పరిశీలన చేస్తారు. ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్‌లు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. డాటా ఎంట్రి చేయించే సంబంధిత ఎంపీడీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో మాత్రమే చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. నిర్ణీత సమయంలోగా డాటా ఎంట్రీ పూర్తి చేసేలా అధికారులు స్పష్టమైన ప్రణాళికలను రూపొందించుకున్నారు. ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే నివృత్తికి జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. దీనికి ఫోన్‌చేసి సందేహాలను తీర్చుకోవచ్చు. డాటా ఎంట్రీ శిక్షణలో భాగంగా వివరాలను ఏ విధంగా నమోదు చేయాలనే దానిపై మాస్టర్ ట్రైనర్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లను చేశారు. డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని మండల స్థాయిలో తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఏపీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

పథకాల వారీగా ఎంట్రీ

ప్రజా పాలనలో భాగంగా ముఖ్యంగా ఐదు పథకాలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత పథకాలు వీటిలో ఉన్నాయి. రూ.500లకు గ్యాస్ సిలిండర్ మహిళలకు రూ.2500 నగదు బదిలీ, పెన్షన్‌ల పంపిణీ, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల నగదు సహాయం, కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం దరఖాస్తులను తీసుకున్నారు. ప్రతీ పథకానికి వేర్వేరుగా దరఖాస్తులు చేసుకునే అవసరం లేకుండా ఏ పథకానికి అర్హులైన వారు ఆ పథకంకు సంబంధించిన వివరాలు మాత్రమే దరఖాస్తు ఫారాల్లో నింపారు. ఒకే ఫారంలో అన్ని పథకాలకు సంబంధించిన వివరాలు ఇచ్చారు. దరఖాస్తుల్లో లబ్ధిదారులు టిక్ పెట్టిన పథకాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత ఈ వివరాలన్నింటినీ క్రోడీకరిస్తారు. దీంతో ఏ లబ్ధిదారుడు ఏ పథకం కింద దరఖాస్తు చేసుకున్నది స్పష్టం అవుతోంది. ఈ పథకం కింద ఎంత మంది దరఖాస్తు చేసుకున్నది తెలుస్తోంది. డాటా ఎంట్రీ పూర్తయిన తర్వాత పరిశీలన చేపడతారు. ఏ పథకం కింద ఎవరు అర్హులో నిర్ణయిస్తారు. వారిని ఎంపిక చేసి సమాచారం అందిస్తారు.

ఇప్పటి వరకు సుమారు లక్షా 50 వేల వరకు ఎంట్రీ

జిల్లాలో ఇప్పటి వరకు ప్రజా పాలనకు సంబంధించిన వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 1.50 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. గత నెల 28 నుంచి ఈనెల 6 వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,08,166 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఐదు గ్యారెంటీలకు 2,94,799 మంది దరఖాస్తు చేసుకోగా ఇతర వాటి కోసం 1,33,67 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల్లోని వివరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోర్టల్‌లో ఈనెల 17 వరకు ఎంట్రీ చేయనున్నారు.



స్వామి వారిని అలంకరించిన దృశ్యం

కాలభైరవ స్వామి ఆలయంలో సింధూర పూజలు

రామారెడ్డి, జనవరి 9: రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన కాల భైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వ దినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య భైరవునికి క్షీరాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రాం చంద్రంగుప్తా, జూనియర్ అసిస్టెంట్ సురేందర్‌గుప్తా, మాజీ ధర్మకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు

రెవెన్యూ అధికారి అండదండలు

● చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుల డిమాండ్


బీర్కూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బీర్కూర్, జనవరి 9 : బీర్కూర్ మండలంలో కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణాకు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ సురేందర్ రెడ్డి పూర్తి అండదండలు అందజేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ డీసీసీ కార్యదర్శి బస్వరాజ్ పటేల్ ఆరోపించారు. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా జరుగకుండా అధికారులు ఒక వైపు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా, బీర్కూర్, బరంగేడ్గి, కిష్టాపూర్, దామరంచ గ్రామాల గుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని విమర్శించారు. ఇదిలా ఉండగా.. గత రెండు రోజులుగా బీర్కూర్ మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద నిల్వ చేసి ఉంచిన ఇసుక డంప్‌లను కొంత మంది జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌లలో లోడ్ చేసి అక్రమంగా తరలిస్తుంటే కాంగ్రెస్ నాయకులు అడ్డుకుని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారన్నారు. జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేయమని ఆర్ఐ సురేందర్‌రెడ్డిని తహసీల్దార్ ఆదేశిస్తే ఆయన జేసీబీని, ట్రాక్టర్లను వదిలి పెట్టాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆర్ఐ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్న అధికారిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి డంపులను స్వాధీనం చేసుకోవాలన్నారు. బీర్కూర్‌లో రామ మందిరం, ఉర్దూ మీడియం పాఠశాల నిర్మాణ పనులకు ఇసుక ఇప్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, విండో చైర్మన్ కమలాకర్ రెడ్డి, మైనారిటీ నాయకుడు ఎక్బాల్, నాయకులు యమ రాములు, సాహెబ్ రావు, కృష్ణారెడ్డి, ఓంకార్, బ్రహ్మయ్య, కిరణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 317బాధితులను సొంత జిల్లాలకు కేటాయించాలి

ఆర్మూర్‌టౌన్ జనవరి 9 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశంగా ఉపాధ్యాయ ఉద్యోగుల నెత్తిన రుద్దిన జీవో 317బాధితుల్ని సొంత జిల్లాలకు కేటాయించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో 317జీవో కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 30మంది ఉద్యోగ ఉపాధ్యాయుల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ రెండు సంవత్సరాల క్రితం భీమ్‌గల్‌కు చెందిన బేతల సరస్వతి చిత్రపటానికి శ్రద్ధంజలి ఘటిస్తూ నివాళులు అర్పించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీలైనంత తొందరలో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 317జీవో బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కట్ట దత్తాద్రి, కామారెడ్డి బాధిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ఆర్మూర్‌రూరల్, జనవరి 9 : మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి, ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అంద జేస్తున్న ఉజ్వల గ్యాస్, ముద్రలోన్, ప్రధాన మంత్రి వికాస్ యోజనతో పాటు వీధి వ్యాపారులకు అందజేసే రుణాలపై ప్రజలకు అవగాహన కల్పిం చారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర ద్వారా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు చేరవేయడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి పులి యు గంధర్, దుగ్గి విజయ్, సాయినాథ్‌రెడ్డి, సుమన్, గంగాధర్, పెర్కిట్ ఎస్‌బీఐ మేనేజర్ సంజీవ్, ఏఈవో నరేష్, డాక్టర్ మానస, డాక్టర్ రాజేశ్వర్, ఐసీడీఎస్ అధికారిణి జ్యోతి, అంగన్‌వాడి సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెలంగాణ జీహెచ్ఎంఏ క్యాలెండర్ ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్, జనవరి 9 : పట్టణంలోని రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ ఆర్డీవో వినోద్ కుమార్ మంగళవారం తెలంగాణ జీహెచ్ఎంఏ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తులను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా



జక్రాన్‌పల్లిలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జక్రాన్‌పల్లి, జనవరి9: ఆరు గ్యారెంటీల పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోగా ఈ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా అన్నారు. మంగళవారం జక్రాన్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో 21గ్రామాలకు సంబంధించిన ఆరుగ్యారెంటీ పథకాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. చిన్న గ్రామ పంచాయతీల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి కాగానే పెద్దగ్రామ పంచాయతీల దరఖాస్తులను తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంచాయతీ కార్యదర్శులకు సహకరించాలన్నారు.అదనపు కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, ఎంపీడీవో బ్రహ్మానందం, తహసీల్దార్ ఎంఎ. ఖలీం, ఎంపీవో యునుస్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పిట్లం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల పూర్తి వివరాలు పీడింగ్ చేయడం జరుగుతోందని ఆర్‌వో భుజంగరావ్ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో ప్రజాపాలన దరఖాస్తులపై సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు సేకరించారు. ఆన్‌లైన్ పీడింగ్ ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండ లంలో ప్రజాపాలనలో 13200 దరఖాస్తులు రావడం జరిగిందని, వారి పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో పీడింగ్ చేస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశం, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, ఎంపీవో బ్రహ్మం, ఆర్ఐ శీతల్, పాల్గొన్నారు.

కంచె చేను మేసింది.. ఇంటి ఉద్యోగులే నిందితులు

● ఆరు గురు బ్యాటరీ దొంగల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు ● 72 బ్యాటరీలు, 1.5 లక్షల నగదు స్వాధీనం



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ

బాన్సువాడ, జనవరి 9: కంచె చేను మేసే విధంగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో పని చేసే కొంతమంది ఉద్యోగులు బీఎస్ఎన్ఎల్ టవర్ లోని బ్యాటరీలను దొంగతనాలకు పాల్పడుతూ కామారెడ్డి జిల్లా బాన్స్ వాడ పోలీసులకు మంగళవారం పోలీసులకు చిక్కారు. ఈకేసులో ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మంగళవారం బాన్స్‌వాడ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...మంగళవారం బాన్స్ వాడలో వాహనాల తనిఖీలో భాగంగా కొయ్యగుట్ట వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా కారులో 5 గురు వ్యక్తులు పరారయ్యారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని అదుపులోకి తీసుకుని విచారించగా విషయాలు వెలుగులోకి వ చ్చాయని డీఎస్పీ తెలిపారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జిల్లా బీఎస్ఎన్ఎల్ టవర్స్ సూపర్ వైజర్ ఉద్యోగి అరుణ్‌కుమార్,అదే కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు,సిబ్బంది రవి, గొలుసుల లింగం,మ్యాతరి సాయిలు,గైని షైశయ్యలు కలిసి కామారెడ్డి జిల్లాలోని 10గ్రామాలలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్లలో ఉన్న బ్యాటరీలను దొంగిలించినట్లు ఆయన తెలిపారు. వీరు దొంగిలించిన బ్యాటరీలను కామారెడ్డి పట్టణంలోని ఖలీల్ బ్యాటరీ దుకాణంలో అమ్ముతున్నట్లు విచారణలో తేలింది. మరి కొన్ని బ్యాటరీలను హైదరాబాద్‌లోని ముషీరాబాద్ బ్యాటరీల దుకాణంలో అమ్ముతున్నట్లు నిందితులు అంగీకరించారని, వారి వద్ద నుంచి 72 బ్యాటరీలు, 1.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అంతేగాక ఒకకారు, వ్యాను వీరు వినియోగిస్తూ బ్యాటరీల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. బ్యాటరీలు కొన్న ఖలీల్‌ను కూడ అరెస్టు చేసి రిమాండ్ చేశామని తెలిపారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 264 బీఎస్ఎన్ఎల్ బ్యాటరీలు దొంగిలించినట్లు ఆయన తెలిపారు. మొత్తం రూ.6 లక్షల విలువైన సొత్తు చోరీకి గురయినట్లు గుర్తించామన్నారు. ఇంక పూర్తిగా విచారణ జరిపి 5గురు నిందితులు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇంక ఎక్కడెక్కడ బ్యాటరీల దొంగతనం చేశారో వీరి ప్రమేయం ఏ కేసులో ఉందో పూర్తి విచారణ చేపడుతామని డీఎస్పీ తెలిపారు. ఈ చోరీ కేసులో చురుకుగా వ్యవహరించిన సీఐ మహేందర్ రెడ్డితో పాటు, ఇద్దరు ఎస్ఐలకు, సిబ్బందికి అభినందించారు. వీరికి రివార్డు కోసం జిల్లా ఎస్పీ పంపుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐ మహేందర్ రెడ్డి, ఎస్ఐలు చంద్రయ్య, జగన్నాథం, కానిస్టేబుల్లు గంగాధర్, అశోక్ లు ఉన్నారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రిని వెయ్యి బెడ్లకు పెంచాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 9: నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆసుపత్రి, మెడికల్ కళాశాలలను వెయ్యి బెడ్ల ఆసుపత్రిగా మార్చాలని అలాగే వాటిలో పనిచేస్తున్న సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ప్రభుత్వం అమలు చేసిన జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్యలు డిమాండ్ చేశారు. సంవత్సరానికి 2, 3 జాతీయ, పండగ, ఆర్జిత సెలవులు అమలు చేయాలని, జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రోజురోజుకు రోగులు పెరుగుతున్నందున దాన్ని వెయ్యి పడకల ఆసుపత్రిగా చేయాలన్నారు. కార్మికుల సంఖ్యను పెంచి ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపై పనిభారం తగ్గించాలన్నారు. ఈ సమావేశంలో షైమదీ, భాగ్యలక్ష్మి, నర్సయ్య, వెంకటేశ్, లలిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్

ఇసుక డంప్ సీజ్

కోటగిరి,జనవరి9: పొతంగల్ మండలంలోని శేషాద్రి ఫారం సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను మంగళవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. శేషాద్రి ఫారంలో ఇసుకను అక్రమంగా డంప్ చేసినట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఆర్ఐ సాయిలు ఇసుక డంప్‌ను పరిశీలించి సీజ్ చేశారని ఆయన తెలిపారు. సీజ్ చేసిన ఇసుకకు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సుమారు 15ట్రాక్టర్ల ఇసుక ఉందన్నారు. ఇసుక వేలంపాటలో పాల్గొనే వారు 5వేల రూపాయల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

సర్వే వివరాలను యాప్‌లో నమోదు చేయాలి

● డీపీఎం సుధాకర్



బీర్కూర్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఎం సుధాకర్

బీర్కూర్, జనవరి 9: గ్రామీణ పేదరిక తగ్గింపు కోసం సర్వే చేసిన వివరాలను వీపీఆర్‌పీ యాప్‌లో త్వరితగతిన నమోదు చేయాలని డీపీఎం సుధాకర్, ఐకేపీ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన బీర్కూర్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయానికి విచ్చేశారు. సర్వే వివరాలు యాప్‌లో ఎలా నమోదు చేస్తున్నారు అనే విషయాలను ఏపీఎంను అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఐకేపీ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వారి స్థితిగతులపై సర్వే చేసింద న్నారు. సొంత ఇల్లు ఉందా లేదా, పెన్షన్ వస్తుందా లేదా, ఆరోగ్యశ్రీ కార్డు ఉందా, సిలిండర్, మరుగుదొడ్డు, విద్యుత్ కనెక్షన్ తదితర వివరాలు అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారని తెలిపారు. అట్టి వివరాలను వీపీఆర్‌పీ యాప్‌లో పొందుపరుస్తున్నామని అన్నారు. అనంతరం ఈ రిపోర్టును గ్రామపంచాయతీలకు అందజేస్తామని చెప్పారు. ఒకవేళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏవైనా సంక్షేమ పథకాలు అమలు చేస్తే తాము ఇచ్చిన రిపోర్టు ఆధారంగా లబ్దిదారులను ఎంపిక చేయవచ్చని తెలిపారు. పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గంగాధర్, సీసీ నాగలక్ష్మీ, సిబ్బంది దశరథ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రాక

నాగిరెడ్డిపేట, జనవరి 9: నాగిరెడ్డిపేట మండల సర్వసభ్య సమా వేశం బుధవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తు న్నట్లు ఎంపీపీ రాజ్‌దాస్ తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హాజరవుతున్నట్లు ఆయన తెలి పారు. ఈ సమావేశానికి మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

నిజాంసాగర్‌లో క్యాలెండర్ ఆవిష్కరణ

నిజాంసాగర్, జనవరి 9: నిజాంసాగర్ మండల విద్యా వనరుల కేంద్రంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రూప్ సింగ్, సంఘ సభ్యులతో కలిసి నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా రూప్‌సింగ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, గణపతి, కృష్ణమూర్తి, బలరాం, రాజశేఖర్, కృష్ణ, రమేష్, తదితరులున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎంపీడీవో

పెద్ద కొడప్‌గల్, జనవరి 9: ప్రతి ఒక్కరూ క్రీడలను ఆడటం వలన మానసిక ఉల్లాసం కలుగుతోందని పెద్ద కొడప్‌గల్ ఎంపీడీవో రాణి అన్నారు. మంగళవారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో యువ జన సంఘం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీవో రాణి మాట్లాడుతూ నేటి కాలంలో యువతతో పాటువిద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌లకు అలవాటు పడి శారీరక శ్రమ లేకుండా చేసుకుంటున్నారని తెలిపారు. శారీరకశ్రమ లేకపోవడంతో అనారోగ్యాల బారినపడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడలను ఆడటం వలన శరీరానికి ఎంతో ఉపయోగ పడుతోందని తెలిపారు. ఇటువంటి పోటీలను ఏర్పాటు చేసిన కాటేపల్లి యువతకు ఎంపీడీవో అభినందించారు. అనంతరం కాటేపల్లి యూత్ సభ్యులు మాట్లాడుతూ ఈ పోటీలు ఈ నెల 9 నుంచి 16 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పెద్ద కొడప్‌గల్ మండలంతో పాటు ఇతర మండలాలకు చెందిన 32 టీంలు ఈ పోటీలలో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల ముగింపు అనంతరం విజేతగా నిలిచిన జట్టుకు 22 వేల 2 వందల 22 రూపాయలు, రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.11 వేల 116లతో పాటు ట్రోఫీ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సూర్యకాంత్ సర్పంచ్ విఠల్, నాయకులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో గణపతి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఆర్మూర్‌రూరల్, జనవరి9: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని బొర్ర గణపతి ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు పెర్కిట్‌కు చెందిన పుచ్చుల రమేష్ రూ.లక్ష 25వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించగా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సాయికుమార్, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో పూజలు

బాన్సువాడటౌన్, జనవరి 9: పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఆలయ అర్చకులు పురుషోత్తమ శర్మ భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో సుబ్రహ్మణ్యేశ్వరుని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.

మంత్రులను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే తోట

పెద్ద కొడప్‌గల్, జనవరి 9: తెలంగాణ రాష్ట్ర మంత్రులను మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావ్ హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట మాట్లాడుతూ నియోజక వర్గంలో అభివృద్ధి పనులు చేసేందుకు గాను మంగళవారం మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావ్‌లను కలవడం జరిగిందని తెలిపారు. జుక్కల్ నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనులకు గాను నిధులు విడుదల చేయాలని కోరగా, మంత్రులు సానుకూలంగా స్పందించారని తోట తెలిపారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణ వేడుకలు

పెద్ద కొడప్‌గల్, జనవరి 9: మండలంలోని బేగంపూర్ గ్రామంలో మంగళవారం మావురాల ఎల్లమ్మ కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామానికి చెందిన సున్నం నారాయణ మావురాల ఎల్లమ్మ కల్యాణ వేడుకలు నిర్వహించాలనే తలంపుతో మంగళవారం అమ్మవారి లంద ఊరేగింపు చేసి ఆలయంలో ఎల్లమ్మ తల్లి వివాహం జరిపించారు.ఊరేగింపు సమయంలో హైదరాబాద్ నుంచి వచ్చిన శివస త్తులు చేసిన విన్యాసాలు గ్రామస్థుల్ని అలరించాయి. ఈ కార్యక్రమానికి గ్రామంలోని భక్తులు హాజరు కావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎల్లమ్మ తల్లి కల్యాణం అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అయోధ్య రాముని అక్షింతల వితరణ

ఇందల్వాయి,జనవరి 9: ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్ పల్లి గ్రామ పరిధిలోగల బోల్యానాయక్ తండా, సామ్యానాయక్ తండాలలో మంగళవారం అయోధ్య రాముని అక్షింతలను గ్రామస్థులు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామ మందిర నిర్మాణం కల ఇప్పుడు నెరవేరబోతుందని రామ మందిరం నిర్మాణం జరగడం ప్రతీ ఒక్క హిందువు గర్వించదగిన విషయమన్నారు. ఈనెల 22వ తేదీన అయోధ్య రామమందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ జరుగుతుండటంతో అక్కడి నుంచి వచ్చిన అక్షింతలను ప్రతీ గ్రామంలో గడప గడపకు అందజేస్తున్నామన్నారు. ఈ వితరణ కార్యక్రమంలో గ్రామానికి చెందిన శ్రీను, శ్రీధర్, పాల్గొన్నారు.

రూ.50వేల నగదు చోరీ

ఆర్మూర్‌టౌన్ , జనవరి9: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న అటెండర్ సుశీల బ్యాగులో నుంచి రూ.50వేల నగదును చోరీకి గురైంది. బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం శుక్రవారం బ్యాంకు నుంచి తెచ్చుకున్న డబ్బులను సోమవారం తన బ్యాగులో తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చింది.విధులుముగించుకొని ఇంటికి వెళ్లి బ్యాగులో చూడగా అందులో నగదు లేకపోవడంతో ఆందో ళనకు గురైంది. మంగళవారం ఉదయం కార్యాలయ సిబ్బందికి జరిగిన సంఘటన వివరించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఆమె తెలిపారు.


కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: అశ్విని శ్రీవస్తవ

ఇందల్వాయి, జనవరి 9:లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఆహార ప్రజాపంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి అశ్విని శ్రీవస్తవ అన్నారు. మంగళవారం ఇందల్వాయి మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామంలో కొనసాగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అశ్విని శ్రీవస్తవ హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వంద శాతం లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను చేపట్టడం జరిగిందన్నారు. అర్హులై సంక్షేమ పథకాలు లబ్ధి పొందని వారు గ్రామాల్లో ఉండకూడదనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. పేద ప్రజలకు మౌలిక సదుపాయాలైన పారిశుధ్యం, ఆర్థిక సహాయం, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు, పక్కాఇళ్లు, ఆహార భద్రత, పౌష్టికాహారం, వైద్యం, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా అనేక కార్యక్ర మాలు అమలు చేస్తుందని ప్రతీ ఒక్కరు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకో వాలన్నారు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలన్న అకుంఠిత దీక్షతో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వం లోనే కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. సంకల్ప యాత్ర కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్, ఎల్‌డీఎం శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో రాములు నాయక్, సర్పంచ్ బండ గంగవ్వ, డీఎల్‌పీవో నాగరాజు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడి మృతి

● ఆరుగంటల పాటు యువకుడి మృతదేహంతో నిరసన

ఇందల్వాయి, జనవరి 9: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందల్వాయి గ్రామ పెద్దమ్మ ఆలయం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇందల్వాయి గ్రామానికి చెందిన కుమ్మరి రాజేష్ (16) యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గండితండాకు చెందిన లకావత్ నరేందర్ తన కుటుంబ సభ్యులతో ఇందల్వాయి వైపు వస్తుండగా అదే సమయంలో వస్తున్న కుమ్మరి రాజేష్ చెరువు వద్దకు వెళ్తుండగా ఇందల్వాయి పెద్దమ్మ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికి ఒకటి ఢీకొనడంతో కుమ్మరి రాజేష్ తన బైక్‌పై నుండి కిందపడిపోయి తలకు బలమైన గాయం కావడం వల్ల అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మరో ద్విచక్ర వాహనంపై ఉన్న నరేందర్ దంపతులకు తీవ్ర గాయాలు అయ్యాయని నరేందర్ కుమారుడు బైక్‌పై నుంచి ఎగిరిపడి రోడ్డుపక్కన పొలంలో పడటంతో అతనికి ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. వెంటనే 108కు సమాచారం అందించగా గాయాలైన నరేందర్ దంపతులను నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడికక్కడే మృతి చెందిన రాజేష్ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. రాజేష్‌కు నష్టపరిహారం చెల్లించే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని భీష్మించుకొని కూర్చోవడంతో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మృతి చెందిన రాజేష్‌ను ఆరుగంటలైనా అక్కడి నుంచి తరలించలేదు.గ్రామ యువకులు, బంధువులు పెద్ద ఎత్తున గొడవ చేయడంతో స్థానిక ఎస్సై మహేష్‌తో పాటు డిచ్‌పల్లి సీఐ కృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని మృతి రాజేష్ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఒప్పుకున్న గ్రామస్థులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు రాజేష్ ఇటీవలే గల్ఫ్‌దేశం వెళ్లివచ్చాడని మరో వారం రోజుల్లో తిరిగి గల్ఫ్ వెళ్లాల్సి ఉండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు రాజేష్ తల్లిదండ్రులకు ఒకే ఒక్క సంతానమని అన్నారు. ప్రమాదంలో రాజేష్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ కృష్ణ తెలిపారు.



రాజేష్(ఫైల్)

ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన బియ్యాన్ని నెలాఖరులోగా ఇవ్వాలి

● కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, జనవరి 9: జిల్లాలో భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కి రైసుమిల్లర్‌లు ఇవ్వాల్సిన బియ్యాన్ని నెలాఖరులోగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉప తహసీల్దార్లు పర్యవేక్షించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో రైసుమిల్లర్లు, ఉప తహసీల్దార్లతో సీఎంఆర్ డెలివరీ వేగవంతంపై సమీక్ష నిర్వహించారు. రైసుమిల్లుల యాజమానులు రోజువారి లక్ష్యాలు పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. లక్ష్యాలు పూర్తి చేయని మిల్లుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైసుమిల్లుల యజమానులు ప్రణాళిక రూపొందించుకుని లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. లక్ష్యం పూర్తి చేయని మిల్లులను సీజ్ చేసి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉప తహసీల్దార్లు ప్రతి నిత్యం రైసుమిల్లులను పరిశీలించి రైసుమిల్ పేరు, మిల్లింగ్ చేసిన వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లిఖార్జున్‌బాబు, మేనేజర్ అభిషేక్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తప్పిదాలు లేకుండా డాటా ఎంట్రీ చేయాలి

రాజంపేట: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేసే క్రమంలో ఎలాంటి తప్పిదాలు లేకుండా చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రజల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను సేకరించిందని తెలిపారు. ఆపరేటర్లకు కేటాయించిన దరఖాస్తు ఫారాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు ఫారాలు లబ్ధిదారులు నింపిన వివరాలు సమగ్రంగా ఆన్‌లైన్‌లో నమోదు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో బాలకిషన్, డీటీ సంతోషి, ఎంపీవో రఘురాం, పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు



సేవా సంఘం స్వచ్ఛంద సంస్థను పరిశీలిస్తున్న విద్యార్థులు

స్వచ్ఛంద సంస్థను సందర్శించిన సౌత్ క్యాంపస్ విద్యార్థులు

భిక్కనూరు, జనవరి 9: భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంలగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సోషల్‌వర్క్ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం కామారెడ్డిలోని సేవా సంఘం స్వచ్ఛంద సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాలో వివిధ కారణాలతో 4వేల మంది వరకు సెక్స్ వర్కర్లుగా మారారన్నారు. వారికి హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సోకకుండా అవగాహన కార్యక్రమాలు, కండోమ్‌ల పంపిణీ, కౌన్సెలింగ్, చికిత్సపై అవగాహన, వారికి ఎప్పటికప్పుడు పరీక్షలు చేయడం వంటి కార్యక్రమాలను సంస్థ తరఫున చేయడం జరుగుతుందన్నారు. సోషల్‌వర్క్ విద్యార్థులు సైతం ఈ అంశాలను అధ్యాయనం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్‌వర్క్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అంజయ్య, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డీపీఎం సుధాకర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అన్నారంలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

బీర్కూర్, జనవరి 9 : వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీర్కూర్ మండలం అన్నారం, చించోల్లి గ్రామాల్లో సంబంధిత అధికారులు పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖలకు సంబంధించి ఏఏ పథకాలు అమలు చేస్తున్నాయో అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు బాబురావు, కిష్టారెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

ఘనంగా ప్రారంభమైన గీతా మహా యజ్ఞం

సదాశివనగర్, జనవరి 9: మండలంలోని లింగంపల్లి శ్రీకృష్ణమందిరం వద్ద విశ్వశాంతి గీతా మహాయజ్ఞాన్ని అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఆలయంలోని స్వామి వారికి మంగళ స్నానాలు నిర్వహించి పుష్పాలంకరణ చేశారు. ఆలయ పీఠాధిపతి మహంతి మాచాలే బాబా ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం భక్తజనావళిని ఉద్దేశించి ప్రొఫెసర్ రాంసింగ్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు గీతా పారాయణం అత్యంత ప్రాముఖ్యమైనదని అన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో కొంత సమయాన్ని భగవంతుని సేవలో నిమగ్నమై ధ్యానం చేస్తే మనస్సు ప్రశాంతతో పాటు జీవితం సుఖాంతంగా కొనసాగుతూ జన్మ సార్థకమవుతుందని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే గీతా మహా యజ్ఞంలో మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి సుమారు 3వేల మంది భక్తజనం పాల్గొనే ఈ కార్యక్రమానికి లింగంపల్లి గ్రామస్థులు సేవ చేసుకోవడం వారి పూర్వజన్మ సుకృతం అన్నారు. గీతా యజ్ఞంలో పాల్గొనడానికి విచ్చేసిన భక్తులతో పాటు ప్రజలంతా మూడు రోజుల పాటు గీతా ధ్యానం పాటించాలన్నారు. వచ్చిన అతిథులకు లింగంపల్లి శ్రీకృష్ణమందిర్ ఆలయ పీఠాధిపతితో పాటు చక్రపాణి బాబా, మురళి బాబా, సారంగబాబా, మోహన్‌బాబాలతో పాటు శ్రీకృష్ణ సేవా సమితి స్వామి వారి భక్తులు ఘనంగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.

ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

కామారెడ్డి టౌన్, జనవరి 9: రెండేళ్లుగా బోధన ఫీజులు మంజూరు కాలేదని వెంటనే బకాయిలు చెల్లించాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా సంక్షేమ విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ఇప్పటికే కోర్సులు పూర్తి చేసిన, చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఉప కారవేతనాలు, బోధన ఫీజులు కలిపి రూ.3250 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఫీజుల విడుదలలో ఆలస్యం, సంక్షేమ శాఖలు విడుదల చేసిన బిల్లులు ట్రెజరీల్లో పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం అప్పులు చేసి కళాశాలల్లో ఫీజులు చెల్లించి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాల్సి వస్తుందని అన్నారు. వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.సంతోష్, రాజేందర్, ప్రభాకర్, నవీన్, చారి, శ్రీధర్, కుమార్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద, జనవరి 9: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు తప్పకుండా అందిస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండుసార్లు ప్రభుత్వ పాలన చేసి పథకాలను ప్రజలకు అందివకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడిన బీఆర్ ఎస్ నాయకులు నెలరోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై పథకాలు అమలు చేయాలని విమర్శించడం సిగ్గుచేటన్నారు. వంద రోజుల్లో తప్పకుండా ఆరుగ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు పరిచి తీరు తారని అందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు. ప్రజల సమస్యలు నేరుగా అర్జీల రూపంలో మండల అధికారుల పరంగా అందిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌పటేల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జునప్ప, విఠల్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీలు కమలకిషోర్, నాయకులు నల్చర్‌రాజు, నాషానాయక్, పార్టీ అధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే



భిక్కనూరులో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

ముమ్మరంగా వాహనాల తనిఖీ

భిక్కనూరు, జనవరి 9: మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా సమీపంలో మంగళవారం వాహనాల తనిఖీ స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాన్ని ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలకు, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలకు పోలీసులు జరిమానా విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు పాటించని 12మంది వాహనదాలరుకు జరిమానాలు విధించడం జరిగిందని ఆయన తెలిపారు.

సౌత్ క్యాంపస్‌లో బోరు బావుల పరిశీలన



బోరు బావులను పరిశీలిస్తున్న అధికారులు

భిక్కనూరు, జనవరి 9: మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో భూగర్భ జలాలు తగ్గిపోయిన, వినియోగంలో లేని బోరుబావులను మంగళవారం జిల్లా భూగర్భ జల అధికారి సతీస్‌యాదవ్, ఎంపీడీవో అనంత్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా భూగర్భ జల అధికారి మాట్లాడుతూ సౌత్‌క్యాంపస్‌లో అభివృద్ధిలో లేని బోరుబావులు, భూగర్భ జలాలు తగ్గిపోయిన బోరుబావులను ఏ విధంగా వినియోగించుకోవాలి, వర్షాకాలంలో ప్రవహించే నీటిని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలన్న విషయాలపై సిబ్బందికి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్యాంపస్‌లో ఇంకుడు గుంతలు, పర్క్యులేషన్ ట్యాంకులు నిర్మించడానికి స్థలాన్ని గుర్తించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, క్యాంపస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోరు మోటార్ల మంజూరు

ఎల్లారెడ్డి, జనవరి 9: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ నాగరాజు జిల్లా పరిషత్ చైర్మన్ దఫేదర్ శోభ అందించిన జడ్పీ నిధులతో మంగళవారం రెండు బోరు మోటార్లను బిగించినట్లు తెలిపారు. ప్రజలకు దాహార్తితో పాటు ఇతర అవసరాలను తీర్చేందుకు ఈ బోర్లను వేసినట్లు తెలిపారు.

కృత్రిమ కాళ్లను అందించిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, జనవరి 9: పట్టణ కేంద్రంలోని 9వ వార్డులో నివాసముంటున్న నాగరాజు అనే బాలుడికి గతంలో టీసీఎం కాళ్లమీదనుంచి వెళ్లడంతో వాటిని తొలగించారు. దీంతో నాగరాజుకు కృత్రిమ కాళ్లు కావాలని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే మంగళవారం హైదరాబాద్‌లో కృత్రిమ కాళ్లను నాగరాజుకు అందేలా చూశారు. తన బాధను గుర్తించి కృత్రిమ కాళ్లను అందించిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటానని బాధితుడు నాగరాజు తెలిపారు. అదేవిధంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని పరామర్శించారు.



సూరాయిపల్లిలో పారిశుధ్య పనులు చేస్తున్న విద్యార్థులు

విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలి

లింగంపేట, జనవరి 9: విద్యార్థి దశనుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలని లింగంపేట పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని సూరాయిపల్లి, మెంగారం గ్రామాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సీతాకాల కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ శత జయంతి సందర్భంగా 1969లో ఎన్ఎస్ఎస్‌ను ప్రారంభించారని ఆయన తెలిపారు. విద్యార్థులు దేశభక్తితో పాటు సంఘసేవ అలవర్చుకోవాలని ఆయన తెలియజేశారు. ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణం. మనం పది మందిలో ఉన్నప్పుడు మనవల్ల పది మందికి ప్రయోజనం ఉండాలని ఆయన సూచించారు. నాయకత్వ లక్షణాలను ప్రజాస్వామిక విలువలను పెంచుకోవాలని ఆయన తెలిపారు. జాతీయ సమైక్యతా సామాజిక అవసరాలను గ్రామాలలో ప్రజలకు వివరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేందర్, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మాకం రాములు, ఎస్ఎంసీ చైర్మన్ నారాయణ, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నేడు భిక్కనూరుకు ఎమ్మెల్యే రాక

భిక్కనూరు, జనవరి 9: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి హాజరుకానున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 11గంటలకు నిర్వహించే కార్యక్రమంలో మండలంలోని ఆయాగ్రామాల లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేస్తామని రమేష్‌రెడ్డి తెలిపారు.

పాఠశాలలో ఫిజియోథెరపి శిబిరం

భిక్కనూరు, జనవరి 9: మండలకేంద్రంలోని భవిత పాఠశాలలో మంగళవారం ఫిజియోథెరపి శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు నవీన్‌సాయి మండలంలోని ఆయాగ్రామాలకు చెందిన విద్యార్థులకు ఫిజియోథెరపి చికిత్సలు నిర్వహించారు. అనంతరం వైద్యుడు మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా ఫిజియోథెరపి చేయడంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు మహేందర్, శ్యాంరాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయ భూమి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

మాచారెడ్డి, జనవరి 9: మండల కేంద్రంలో గజ్యానాయక్ తండా వీరహనుమాన్ వెంకటేశ్వర ఆలయం భూములు కబ్జాలుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు నౌసిలాల్‌నాయక్, మండల ప్రధానకార్యదర్శి బ్రహ్మానందరెడ్డిలు అన్నారు. మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 50 సంవత్సరాల పూరతన వీరహనుమాన్ వెంకటేశ్వరాలయానికి గంధంరాజగోపాల్ సర్వేనంబర్ 255/ఇ/1/2లో రెండు ఎకరాల ఐదు గుంటల భూమిని ఆలయానికి దానం చేశాడని తెలిపారు.ఆ స్థలంపై ఎంపీపీ నర్సింగ్‌రావు వారి అనుచరులు కన్నువేశారని తెలిపారు. అందులో 20 షెటర్లు నిర్మించి అతని కుటుంబసభ్యులకు నాలుగు షెటర్లు, మిగిలిన వాటిని తన అనుచరులకు ఇచ్చి సుమారు రూ.1కోటికి పైగా వసూలు చేసుకున్నాడని ఆరోపించారు. కబ్జాచేసిన భూమిని గతంలో అధికార బలంతో గ్రామపంచాయతీలో తమ తమ పేర్ల మీద మార్చుకుని విద్యుత్ మీటర్లు కూడా తమ పేర్లపై చేయించుకున్నారని తెలిపారు. దేవాలయ ఈవోను సైతం బెదిరింపులకు గురిచేసి ఎలాంటి చర్యలు తీసుకోకుండా అడ్డుపడ్డారని ఆరోపించారు.

రేపు ఉమ్మడి జిల్లాల హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల ఎంపికలు

సుభాష్‌నగర్, జనవరి 9: ఈనెల 11వ తేదీన ఉమ్మడి జిల్లాల జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగా మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్‌లు తెలిపారు. ఆర్మూర్‌లోని విజయ హైస్కూల్‌లో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులను ఆసిఫాబా ద్‌లో ఈనెల 15,16,17తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు వెంట తెచ్చుకో వాలని, 01-01-2004 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. క్రీడాకారులు ఉదయం 10గంటల వరకు మైదానానికి చేరుకోవాలని అన్నారు. మిగతా వివరాలకు హ్యాండ్‌బాల్ కోశాధికారి రాజేష్, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్‌లను సంప్రదించాలని కోరారు.

ముగిసిన యువజన ఉత్సవాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి

డిచ్‌పల్లి, జనవరి 9: టీయూలో గత వారం రోజులుగా ఏబీవీపీ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సుభాష్ చంద్ర బోస్‌ల జయంతి పురష్కరిం చుకొని యువజన ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు కావడంతో ఈ క్విజ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య రవీందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు అందరు ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాల్లో ముందుండాలని స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్‌లను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని దేశసేవలో మరియు దేశానికి ఆపద వచ్చిన వ్పుడు యువత ముందు వరుసలో ఉండాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివా, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు నాగరాజు, నాయకులు సాయికుమార్, అమృత్‌చారి, హరిక్రిష్ణ, రుషి, చందు, నరేశ్, ప్రమోద్, సింహాద్రి, నరసింహ, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వినోద్

నిజామాబాద్ అర్బన్, జనవరి 9: బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నగరానికి చెందిన బురుగుల వినోద్‌కుమార్ నియమితుల య్యారని జిల్లా అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వినోద్ కుమార్‌ను నియమించామన్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లా డుతూ తనపై నమ్మకంతో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన ఆర్.కృష్ణయ్య, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. బీసీల హక్కులు, బీసీలకు రావాల్సి వాటా కోసం ఉద్యమం చేస్తానన్నారు.

31 వరకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జనవరి 9: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు ఈనెల 31 వరకు గడువు పొడగించి నట్లు రీజినల్ కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ, పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు రినివల్ చేసుకునేందుకు ఈనెల 31 వరకు అవకాశం ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు బీఆర్ఏఓ యూ.ఆన్‌లైన్.ఇన్ వెంబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

నేడు బోధన్‌కు అసదుద్దీన్ ఓవైసీ రాక

బోధన్ రూరల్, జనవరి 9: నేడు బోధన్ పట్టణంలోని అయేషా గార్డెన్‌లో ఎంఐఎం ఆధ్వర్యంలో చేపడుతున్న ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎంఐఎం పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ హాజరవుతున్నారని పట్టణ అధ్యక్షులు బాబా తెలిపారు. ఈకార్యక్రమానికి ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

బోధన్ రూరల్, జనవరి 9: బోధన్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు, మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవ డంతో కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులు గత పీఆర్‌సీ వేతన బకాయిలు ఏడు నెలలవి ఇవ్వాల్సి ఉందని, వాటిని వెం టనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కార్మిక ప్రతినిధులు సం దీప్, సురేందర్, గంగాధర్, సాయిలు, భీమ్ సంజీవ్, లక్ష్మణ్, సైదమ్మ, శంకరమ్మ, లావణ్య, మరియమ్మ, లక్ష్మీ, గంగామణి, పోశవ్వ కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల స్పెషల్ డ్రైవ్



పెద్దకొడప్‌గల్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కామారెడ్డి టౌన్, జనవరి 9: నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడిపేవారిపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. మంగళవారం జిల్లాలో పూర్తిగా నెంబర్ ప్లేట్ లేని, అనుమానాస్పద వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. జిల్లాలో మొత్తం 74 వాహనాలను సీజ్ చేయడంతో పాటు 9 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇకనైన వాహనదారులు తమ వాహనాలకు నెంబర్ ప్లేట్‌లు ప్రభుత్వం నిర్ధేశించిన విధంగా ఉంచుకోకపోతే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తాం

పెద్ద కొడప్‌గల్: మండలంలో నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు తిరిగితే అటువంటి వాహనాలను సీజ్ చేస్తామని పెద్ద కొడప్‌గల్ ఎస్ఐ కోనారెడ్డి హెచ్చరించారు. మంగళవారం తన సిబ్బందితో కలిసి అంజనీ గేట్ వద్ద 161 జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాలకు నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా అమర్చుకోవాలని ఎవరైనా నెంబర్ ప్లేట్ లేకుండా తిరిగితే ఆ వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. అంతేకాకుండా వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

ప్రియా 35	-	సలార్
దర్పన్	-	ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్
శాంతి	-	ఎనిమల్
ప్రియా 70	-	హాయ్ నాన్న

బాన్సువాడ

మహేశ్వరి - సలార్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

